

నానాటికీ ప్రభంజనం..

భారతదేశం జన ప్రభంజనం అవుతుంది.. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశ జనాభా కేవలం 35 కోట్లు కాగా, 80 ఏళ్ల అనంతరం నాలుగు రెట్లకు పైగా చేరుకుందని అంచనా.


4లో



దళిత మహిళపై దాడి అమానుషం

దుప్పలపూడి గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళ కొమ్ము బుజ్జిపై దాడి చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి 2,30,624 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 13,750 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

సహకార సీఈఓల ధర్నా



మలికిపురంలో ధర్నా చేస్తున్న సహకార సంఘాల సీఈఓలు

మలికిపురం: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు ధర్నా చేశారు. ఈ మేరకు బుధవారం మలికిపురం డీసీసీబీ వద్ద నిరసనకు దిగారు. మలికిపురం బ్యాంక్ పరిధిలో 10 సహకార సంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఈఓలు రామలింగేశ్వరరావు, ఆకుల బోగేశ్వరరావు, రంగరాజు, రామరాజు, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటేందుకు సన్నాహాలు



జి.మమ్మీ

రాయవరం: 'అమ్మ పేరిట ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని గురువారం పాఠశాలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల్లో మెగా పేటీఎం 2.0 పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటడంతోపాటు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. పాఠశాలల్లో తగినంత స్థలం లేని పక్షంలో ఇంటి వద్ద లేదా రహదారుల పక్కన మొక్కలు నాటి వాటి సంరక్షణను నాటిన వారే చేపట్టే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లపాటు మొక్కలు సంరక్షించే బాధ్యతలను పక్కాగా చేపట్టేందుకు గ్రీన్ పాస్‌పోర్టును విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు.

గోదారి జలజడి

- లంక వాసుల్లో గుబులు
- కానరాని అధికారుల ముందస్తు చర్యలు
- నామమాత్రంగా సమీక్షలు
- పలుచోట్ల ఏటిగట్లు బలహీనం
- శిథిలావస్థలో ఫ్లడ్ స్టోరేజ్‌లు

సాక్షి, అమలాపురం: గోదారి ఎరుపెక్కింది.. పరవళ్లు తొక్కుతూ ముందుకు వస్తోంది.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు వేగంగా పరుగులు తీస్తోంది. ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటు తగిలింది. కాటన్ బ్యారేజీకి నీరు వచ్చి చేరుతోంది. రెండు, మూడు రోజుల నుంచి వరద నీరు పెరగడం, తగ్గడం జరుగుతోంది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు మాత్రం వరదల సీజన్ వచ్చింది.

గోదావరికి వరద పోటు తగలడంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు బుధవారం సాయంత్రం 2,30,624 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. వాస్తవంగా ఆదివారం 2,11,837 క్యూసెక్కులకు పెరిగి తరువాత తగ్గింది. తిరిగి పెరుగుతోంది. గోదావరికి ఈ ఏడాది వరదల సీజన్ ముందుగానే మొదలైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడితే ముందు ముందు వరద పెరిగే అవకాశముంది. ఈ నెల నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ వరదల సీజన్. తరువాత క్రమేపీ తగ్గుముఖం పడుతోంది.

జలదిగ్బంధమే..

గోదావరి వరద ఉధృతిని బట్టి జిల్లాలో ముంపు తీవ్రత అధికంగా ఉంటోంది. 18 మండలాల్లో 103 గ్రామాలు వరదల బారిన పడతాయి. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం మండలాల్లోని లంక గ్రామాలకు తీవ్రత అధికంగా ఉంటుంది. ఇక్కడ పలు లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. పలు గ్రామాలకు పడవల మీదనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కొద్దిపాటి వరదకే పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, బూరుగులంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేటపై తొలి ప్రభావం ఉంటోంది. తరువాత ఇదే మండల పరిధిలో జొన్నలంక, మానేపల్లి శివాయలంక, పల్లెపాలెం, కె.గంగవరం మండలం కోటిపల్లి మత్స్యకార కాలనీ, తాళ్లరేవు మండలం పిల్లంక పంచాయతీ కొత్తలంక, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక, గురజాపులంక, అల్లవరం మండలం బోడసుకుర్రు మత్స్యకార కాలనీలో వరద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వరద పెరిగే కొద్దీ మిగిలిన ప్రాంతాల్లోనూ ముంపు అధికమవుతోంది.



వరద వస్తే బతుకు గోదారే: ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంకలో నీట మునిగిన ఇళ్లు (ఫైల్)

ఏటిగట్లు.. నిర్వహణకు తూట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో గోదావరి, గౌతమీ, వశిష్ట, వైనతేయ, కోరంగి నదులు సుమారు 260.80 కిలో మీటర్లు కాగా, వీటికి రక్షణగా నిర్మించిన ఏటిగట్లు పొడవు 535 కిలోమీటర్లు. ఇందులో కాటన్ బ్యారేజీ ఎగువన అఖండ గోదావరి కుడి, ఎడమ ఏటిగట్ల పొడవు 83.73 కిలోమీటర్లు. కాగా గౌతమీ కుడి, ఎడమ ఏటిగట్లు, కోరింగ ప్రాజెక్టు ఫ్లడ్ బ్యాంకులు కలిపి 204.70 కిలోమీటర్ల పొడవు ఉంటాయి. వశిష్ట, వైనతేయ కుడి, ఎడమ ఏటిగట్టు పొడవు 246.30 కిలోమీటర్లు. గౌతమీ ఎడమ ఏటిగట్టు పరిధిలో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి, కె.గంగవరం మండలం సుందరపల్లి, కూళ్ల శివారు ఎస్సీ పేట, కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోవలంక వద్ద ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయి. గౌతమీ కుడి ఏటిగట్టు పరిధిలో కొత్తపేట మండలం బోడిపాలెం వంతెన వద్ద గట్టు ఆధునీకరణ జరగలేదు. భారీ వరద వస్తే ప్రమాదకరమే. వృద్ధ గౌతమీ కుడి గట్టు పరిధిలో కాట్రేనికోన మండలం కుండలేశ్వరం పుష్కరాల రేవు వద్ద గట్టు అత్యంత బలహీనంగా ఉంది. వైనతేయ కుడి ఏటిగట్టు పరిధిలో పి.గన్నవరం మండలం డొక్కా సీతమ్మ అక్విడెక్టు నుంచి నాగుల్లంక వరకూ ఏటిగట్టు లేదు. మానేపల్లి, నాగుల్లంక, మామిడికుదురు మండలం పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ, పెదపట్నం వద్ద బలహీనంగా ఉన్నాయి. వశిష్ట ఎడమ ఏటిగట్టు పరిధిలో రాజోలు మండలం తాటిపాక మఠం వద్ద కొంత, రాజోలు సోంపల్లి, రాజోలు ఆంజనేయస్వామి ఆలయం నుంచి శివకోడు వరకు ఏటిగట్టు ఎత్తు, పటిష్ట పనులు చేయలేదు. మలికిపురం మండలం దిండి, రామరాజులంకలతోపాటు పెద్ద వంతెన వద్ద నుంచి సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక వరకు గట్టు బలహీనంగా ఉంది. పి.గన్నవరం ఎల్.గన్నవరం, మొండెపులంక లాకుల వద్ద ఇదే పరిస్థితి.



పి.గన్నవరం ఫ్లడ్ స్టోరేజీలో అంతంత మాత్రంగా సామగ్రి



2022 గోదావరి వరదలకు బూలావారిపేట వద్ద సుమారు 800 మీటర్ల పొడవునా ఇసుక బస్తాలతో ఇలా రక్షణ (ఇప్పుడూ అదే పరిస్థితి)

ఫ్లడ్ 'స్టోరేజ్' అంతంత మాత్రమే..

ఏటిగట్ల రక్షణ కోసం ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అధికంగా ఫ్లడ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఫ్లడ్ స్టోరేజ్‌లు ఆరు కాగా, 15 పర్మినెంట్ ఫ్లడ్ స్టోరేజ్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా వరదల సమయంలో 14 అడిషనల్ ఫ్లడ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలో అన్ని రకాల ఫ్లడ్ స్టోరేజ్‌లు ఏడు ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 26, కాకినాడ జిల్లాలో మూడు చొప్పున ఉన్నాయి. వరద విపత్తులను తట్టుకునేందుకు, గట్లు గండ్లు పడకుండా ఇక్కడ సామగ్రి ఉంచేవారు. ఇటీవల కాలంలో ఫ్లడ్ స్టోరేజ్ ఆలనాపాలనను నీటి పారుదల శాఖ అధికారులు గాలికి వదిలేశారు. ఈ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ పూర్తి స్థాయిలో సామగ్రి ఉంచడం లేదు. జిల్లా యంత్రాంగం సైతం ఏటిగట్ల వద్ద వరదల సమయంలో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం, కలెక్టరేట్ కేంద్రంగా ఒకటి రెండు సార్లు సమీక్షలు నిర్వహించడం తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. దీనివల్ల వరదల సమయంలో అటు లంక వాసులు మాత్రమే కాకుండా డెల్టా వాసులు కూడా భయం భయంగా కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

ఐటీ సర్వీసెస్ అకాడమీతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐటీ సర్వీసెస్ శిక్షణ అకాడమీ ఏర్పాటు చేసి మూడేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఫ్లెక్సీ వ్యాన్ (యూఎస్ఏ) సీఐఓ చిక్కాల విద్యాసాగర్ ముందుకు వచ్చారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో విద్యాసాగర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకుడు శివరామ్ ప్రసాద్‌తో సమావేశమై ఈ అకాడమీ ఏర్పాటుపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ అకాడమీని సుమారు రూ. 35 కోట్ల అంచనాతో ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా విద్యాసాగర్ కృషి చేస్తామని తెలిపారన్నారు. అమలాపురం నివాసి అయిన విద్యాసాగర్ మాతృ భూమికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకురావడం సంతోషదాయకమన్నారు. ఈ అకాడమీ ఏర్పాటుకు జిల్లాలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంగల భూములు సేకరించాలనితెలిపారు.

మినీ ఫిషింగ్ హార్బర్‌కు వసతులు కల్పించాలి

అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్ పూర్తి స్థాయి నిర్వహణ కోసం మౌలిక వసతులను కల్పించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన మినీ ఫిషింగ్ హార్బర్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సుమారు రూ. 30 కోట్లతో చేపట్టిన ఈ మినీ హార్బర్‌లో రూ.23 కోట్లతో పనులు నిర్వహించి 2023లో అప్పగించామని తెలిపారు. మిగిలిన రూ.7 కోట్లకు సంబంధించి విద్యుత్ సరఫరా, తాగునీరు, అప్రోచ్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన జరగాల్సి ఉందని అన్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించడం ద్వారా సుమారు 200 పడవలు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్, జాతీయ రహదారి 216 తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ అంశాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు.

సమన్వయంతో ముందుకు సాగాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: నేర పరిశోధన, రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలు, బాధితులకు సత్వర న్యాయం వంటి ప్రధాన విషయాల్లో పోలీసులు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేసినప్పుడే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలిపారు. వాటిపై ఇతర శాఖల అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని సమీక్షించారు. ముఖ్యంగా సరిహద్దు తగాదాలపై రెవెన్యూ అధికారులు, రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా రవాణా శాఖ అధికారులతో, బాలికలు, మహిళల భద్రతా విషయాలపై సోషల్ వెల్ఫేర్ శాఖతో ఎస్పీ చర్చించారు. విద్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక కమిటీల నియామకంపై అధికారులతో సమీక్షించారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌బీపీ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.పార్థసారథి, డీఈఓ డాక్టర్ షేక్ సలీమ్ బాషా, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్, జిల్లా సోషల్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ పి.జ్యోతిలక్ష్మి, జిల్లా హైవే అథారిటీస్ ఏఈ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలపై గర్జిద్దాం..

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన మోసాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు కోడమ సింహాలై గర్జించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ సమన్వయకర్త పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తొలిత సభా వేదిక వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జగ్గిరెడ్డితోపాటు నియోజకవర్గ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై నియోజకవర్గంలో చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై జగ్గిరెడ్డి షెడ్యూల్‌ను వివరించారు. నిరసన కార్యక్రమాలను గ్రామ, మండల స్థాయిల్లో విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు అనేక హామీలు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు పూర్తిలో న్యాయం జరిగిందని అన్నారు. పార్టీ కార్యకర్తలకు సుముచిత స్థానం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలపై జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పోరాటం చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గ సమన్వయకర్త పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పథకాలను పక్కనబెట్టి, అభివృద్ధిని విస్మరించిందన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు మాతా మురళి, డిల్లీ నారాయణ, పెయ్యల చిట్టిబాబు, కాశి బాలమునికుమారి, నల్లా నరసింహమూర్తి, కుడుపూడి శంకరరావు, కాదా గోవిందకుమార్, రాయపురెడ్డి జానకిరామయ్య, కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి రామకృష్ణ, పిన్నమరాజు వెంకట పతిరాజు, పెన్మత్స చిట్టిరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి శామ్యూల్ సాగర్, నేల కిశోర్, ముదునూరి సతీష్‌రాజు, కోలా బాబ్జీ, జగతా పద్మనాభం, నడింపల్లి సూరిబాబు, బొంతు బుజ్జిబాబు, చింతలపాటి శ్రీనురాజు, కాశి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మేము సైతమంటూ ముందుకొచ్చి..

- పోలీసు కుటుంబాలకు సాయం
- ఎస్పీ కృష్ణారావు చేతుల మీదుగా అందజేత



బాధిత కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్సై, కానిస్టేబుల్ కుటుంబాలకు కోనసీమ జిల్లా పోలీసులు మేమున్నామంటూ ముందుకు వచ్చి చేయూత అందించారు. గత నెల 26న విధి నిర్వహణలో భాగంగా ఆలమూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆలమూరు ఎస్సై మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్‌లు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే. ఆయా కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నవారు మృతి చెందడంతో ఆ కుటుంబాలు పడుతున్న వేదనకు ఓదార్పుగా జిల్లా పోలీసులు అండగా నిలిచారు. వారంతా కలసి రూ.8 లక్షలు సమకూర్చారు. ఈ మేరకు స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు చేతుల మీదుగా ఎస్సై, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ. 4 లక్షల చొప్పున బుధవారం అందజేశారు. అలాగే 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు కూడా అదే బ్యాచ్‌కు చెందిన ఎస్సై అశోక్ మృతికి చింతిస్తూ రూ.68 వేలను బాధిత కుటుంబానికి ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్పీ కార్యాలయ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇదేండబ్బా ప్రచారం

- మెగా పీటీఎం 2.0 పేరుతో కార్యక్రమం
- తల్లికి వందనంపై సొంత బాకా
- ఉపాధ్యాయులకు పనిభారం
- పక్కదారి పట్టిన విద్యాబోధన

కపిలేశ్వరపురం: చేసేది తక్కువ... గొప్పలెక్కువ అన్నట్టు కూటమి ప్రభుత్వ తీరు ఉంది. విలువైన ప్రజాధనాన్ని ప్రచారానికే కేటాయిస్తుంది. ఇప్పటి వరకూ యోగా దినోత్సవం పేరుతో సుమారు రూ.300 కోట్లను ఖర్చు చేసింది. అంతర్జాతీయంగా కూటమి ప్రభుత్వానికి ప్రశంసలు దక్కాయంటూ గొప్పలు చెప్పుకొంది. అదే కోవలో నేడు మరో ప్రచారానికి సిద్ధం చేసింది. మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమాన్ని మెగా పీటీఎం 2.0 పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించేందుకు కార్యాచరణ చేసింది. విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం వెనుక కూటమి ప్రభుత్వ ప్రచారం దాగి ఉంది. దీని నిర్వహణకు పరిమితంగా నిధులను కేటాయించి, స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ నుంచి ఖర్చు పెట్టుకోమని చెబుతోంది. ప్రైవేట్ సంస్థల్లో ఆ యాజమాన్యం సొంత ఖర్చుతో కార్యక్రమాన్ని పండగలా చేయాలని సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రస్తుతం ఈ కార్యక్రమం తలకు మించిన భారంగా మారుతోంది.

నేడు విద్యా సంస్థల్లో కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,150 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల ఫలితాల వివరాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయనున్నారు. వీటితో పాటు మరికొన్ని కార్యక్రమాలు రూపొందించినప్పటికీ ప్రధాన అజెండా కాస్తా కూటమి ప్రభుత్వ ప్రచారమే. తల్లికి వందనం సాయం అందజేశామన్న విషయాన్ని ఫోకస్ చేసే దిశగా కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో తల్లికి వందనం పేరుతో కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తున్నారు. ఈ మార్గదర్శకాలను లీప్ యాప్ నుంచి పొంది అమలు చేయాలని ఆదేశాలిచ్చారు.



మెగా పీటీఎం 2.0 కార్యక్రమం నేపథ్యంలో పాఠశాల గదిలో కట్టిన మామిడి తోరణాలు

ఇప్పటికే సన్నాహక సమావేశాలు

ఈ నెల 4న ఇంటర్మీడియెట్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అమలాపురం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం సన్నాహక సమావేశం నిర్వహించారు. 8న జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్‌కు జిల్లా సన్నాహక సమావేశం జరిపారు. పిల్లలకు పాఠాలు చెప్పే పనిని పర్యవేక్షించాల్సిన విద్యా సంస్థ నిర్వాహకులు, బాధ్యులను కూటమి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు సమయాన్ని కేటాయించమనడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

ఇది సాధ్యమయ్యేనా..?

పాఠశాలల్లోనే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో విద్యార్థులతో మొక్కలను నాటాలని సూచించారు. ఆ మొక్కలను విద్యార్థి బాధ్యతగా సంరక్షించాలని చెబుతున్నారు. రోజూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అది సాధ్యం కాదు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంటే మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ ప్రత్యేక నిధులను, సిబ్బందితో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వివాదాలు రాకుండా చూడాలని..

పేరెంట్స్ మీటింగ్ అనగానే తల్లిదండ్రులు సహజంగా తమ పిల్లల చదువు వివరాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సాయం వివరాలను సైతం తెలుసుకోవాలని అనుకుంటారు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం లబ్ధిదారుల్లో అనేక మంది అర్హులకు సాయం అందలేదు. అందని వారంతా అధికారులను ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ముందే గమనించిన ప్రభుత్వం పేరెంట్స్ మీటింగ్‌లో వివాదాలు రాకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే అని, ప్రోటోకాల్ విషయాల్లో రాజకీయాలు తలెత్తకుండా చూసుకోవాలంటూ సూచించింది.

ప్రచారం.. పనిభారం

ఈ కార్యక్రమ మార్గదర్శకాల్లోనే నాలుగైదు రోజుల ముందు నుంచే ఏమేమి చేయాలో కార్యకలాపాలను పొందుపర్చారు. పాఠశాలల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను తల్లికి వందనం పథకాన్ని ప్రచారం చేసేవారిగా ప్రభుత్వం మార్చేసింది. 17 కమిటీలను వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయమని ప్రభుత్వం చెప్పడంతో ఉపాధ్యాయులంతా ఇదే పనికి తమ విలువైన సమయాన్ని కేటాయించాల్సి వస్తుంది. ఇందులో ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు సచివాలయ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను భాగస్వాములను చేశారు. వీరిని ఒక్కో పాఠశాలకు పర్యవేక్షకులుగా నియమించారు. వారి శాఖల పనిని పక్కన పెట్టి ప్రభుత్వ ఆదేశాలను పాటించే స్థితికి తీసుకొచ్చారు.

విద్యా సంస్థలపై ఆర్థిక భారం

మెగా పీటీఎం 2.0 కార్యక్రమం కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించామని చెబుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. సంబంధించిన ఖర్చులను స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ నుంచి ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేసుకోవచ్చని చెప్పారు. దాతల ద్వారా నిర్వహణ సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. ఇవన్నీ క్షేత్ర స్థాయిలో అమలుకు సాధ్యమా అనేది విద్యా సంస్థల నిర్వాహకులను వేధిస్తుంది. చివరికి చేతి చమురు వదిలించుకోక తప్పదన్న భావనతో నిర్వాహకులు ఉన్నారు. ఇదిలా ఉంటే ఈ కార్యక్రమం నిర్వహణలోని ప్రతి క్షణాన్ని ఫొటోలు, వీడియోలు తీసి నిర్దేశించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

చిత్తశుద్ధి ఉంటే నిధులు కేటాయించాలి



మెగా పీటీఎం 2.0 పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. పాఠశాలల్లో విద్యా బోధన ప్రక్రియ సన్నగిల్లేలా దీనికి రూపొందించారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో అవసరమైన మేరకు నిధులు కేటాయించాలి.

–రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు, ఆలమూరు

నానాటికీ ప్రభంజనం..

- అధిక జనాభాతో వనరుల లభ్యత కరవు
- 2027 ఫిబ్రవరి 1 నుంచి జన, కులగణన
- రేపు ప్రపంచ జనాభా దినోత్సవం



ఆలమూరు: భారతదేశం జన ప్రభంజనం అవుతుంది.. నియంత్రించకుంటే భవిష్యత్ అధోగతిగా మారుతుంది.. చిన్న కుటుంబం– చింతలు లేని కుటుంబం. ఇద్దరు వద్దు.. ఒక్కరు ముద్దు. ఈ నినాదాలకు మళ్లీ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఏర్పడుతోంది. స్వాతంత్య్రోద్యమ కాలంలో దేశ జనాభా కేవలం 35 కోట్లు కాగా, 80 ఏళ్ల అనంతరం నాలుగు రెట్లకు పైగా చేరుకుందని అంచనా. రోజు రోజుకూ పెరిగిపోతున్న జనాభా వల్ల నానాటికీ కరిగిపోతున్న వనరులతో భవిష్యత్ తరాలకు ప్రమాదకరంగా మారింది. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాలైన ఆహారం, ఉపాధి, వివిధ అవసరాలు తీర్చడం ప్రభుత్వాలకు భారం అవుతోంది. అధిక జనాభాతో అడవులు సైతం అంతరించి పోతుండగా పంట భూములు ఆవాస ప్రాంతాలుగా మారిపోతున్నాయి. దీనివల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి భవిష్యత్‌లో పుడమికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని సామాజికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు ఐక్యరాజ్య సమితి అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ జనాభా 2011 గణాంకాల ప్రకారం 51,54,296 మంది ఉండగా, ఇందులో 25,69,888 మంది పురుషులు, 25,84,608 మంది స్త్రీలు ఉన్నారు. అయితే 2025 మార్చి 31 నాటికి ఈ జనాభా సుమారు 55.38 లక్షలుగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాను 2022 ఏప్రిల్ 4న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు జిల్లాలుగా విభజించింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మూడు నియోజకవర్గాలు ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కాగా, రంపచోడవరం నియోజకవర్గాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనం చేశారు. దీంతో జనాభా గణాంకాల్లో తీవ్రమైన వ్యత్యాసం ఏర్పడింది. జిల్లాలో 2001 జనాభా లెక్కల ప్రకారం 10.98 శాతంగా ఉన్న పెరుగుదల 2011కు వచ్చేసరికి 13.86 శాతంగా ఉంది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ జనాభా శాతం మరింత పెరిగి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కష్టతరం అవుతుంది. జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో వాయు కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. అందువల్ల వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

జిల్లాల వారీగా జనాభా వివరాలు


జిల్లా	జనాభా	పురుషులు	స్త్రీలు	వైశాల్యం
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	17,19,013	8,58,632	8,60,381	2,083 కి.మీ
కాకినాడ	20,92,374	10,45,269	10,47,105	3,020 కి.మీ
తూర్పుగోదావరి	18,32,332	9,15,325	9,17,007	2,561 కి.మీ

గణనకు షెడ్యూల్ విడుదల

జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేస్తే దేశ భవిష్యత్తు బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. 2011లో జరిగిన జనగణన తరువాత పదేళ్ల తరువాత 2021లో జరగాల్సి ఉంది. అయితే ఆ సమయంలో కోవిడ్–19 ప్రభావం అధికంగా ఉండటంతో వాయిదా పడుతూ వస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గణనలో భాగంగా 2026 ఏప్రిల్ ఒకటి నుంచి తొలుత ఇళ్లు, ఆస్తుల వివరాలు నమోదు చేసుకునేందుకు నిర్ణయం తీసుకుంది. అనంతరం 2027 ఫిబ్రవరి నుంచి జన, కుల గణనలను ఒకేసారి చేపట్టేందుకు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. ఈ జన, కుల, ఆస్తుల గణనలో ప్రతి ఒక్కరి నుంచి 36 ప్రశ్నలకు సంబంధించి సమాచారాన్ని సేకరించనుంది.

ప్రాధాన్యం ఇస్తే మేలు

ఉమ్మడి జిల్లాలో అధిక జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. జనాభా పెరుగుదలతో కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ప్రసార మాధ్యమాల్లో ప్రచారం కల్పించాలి. కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి ప్రోత్సాహకాలను అందజేయాలి. సమాజంలో వీలైనంత మేరకు అధిక వయసు పెళ్లిళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివాహం చేసుకున్న ప్రతి జంట స్వచ్ఛంద నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది.



ప్రపంచ జనాభా దినోత్సవం లోగో

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హజ్ యాత్ర -2026కు వెళ్లడానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు కేంద్రం ప్రకటించిన దృష్ట్యా 2025 జులై 31 వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎమ్.సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్రలో పాల్గొనేవారు తప్పనిసరిగా ఇంటర్ నేషనల్ పాస్‌పోర్ట్ కలిగి ఉండాలని, హజ్ సువిధ మొబైల్ యాప్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరణం, ఎమర్జన్సీ మినహాయించి యాత్రను రద్దు చేసుకుంటే జరిమానా తప్పదని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

యువతకు కువైట్‌లో ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: నిరుద్యోగ యువతకు కువైట్‌లో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విడిజి మురళి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ సంయుక్తంగా తాత్పర్య అనే అంతర్జాతీయ సంస్థతో కలిసి కువైట్‌లో ఉన్నత నైపుణ్యం కలిగిన నిర్మాణ కార్మికులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అర్హత కలిగిన 24 నుంచి 50సంవత్సరాల వయసు కల్గిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ లేదా సీలింగ్ పనుల్లో ఐటీఐ లేదా డిప్లమా ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. 3–5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగావకాశం, నెలకు కువైట్ డాలర్ కెడబ్ల్యూడి 200 నుంచి 250 (భారత రూపాయలలో సుమారు రూ.56,000 – రూ70,000 వరకు) జీతంగా లభించనున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలు ఉద్యోగ ఒప్పంద కాలవ్యవధి అన్నారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు నివాస ఏర్పాట్లను కంపెనీ అందిస్తుందన్నారు. అభ్యర్థులు తమ పాస్‌పోర్టు, ఐటీఐ/డిప్లమా సర్టిఫికెట్, అనుభవ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99888 53335 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నాగభూషణం (ఫైల్)

గోకవరం: అప్పటి వరకూ విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విధి నిర్వహణలో గుండెపోటుకు గురై తనువు చాలించాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గోకవరం గ్రామానికి చెందిన బొమ్మగంటి నాగభూషణం (57) తంటికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లెక్కల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన రెండు తరగతుల్లో బోధించారు. ఇంటర్వెల్ సమయంలో ఒక్కసారిగా ఆయన కుప్పకూలిపోగా తోటి ఉపాధ్యాయులు వెంటనే ఆయన్ని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన ఇటీవల రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి బదిలీపై తంటికొండకు వచ్చారు.

కుమార్తె వివాహం చేసిన నెలలోనే..

ఉపాధ్యాయుడు నాగభూషణంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు గత నెలలో ఘనంగా వివాహం జరిపించారు. ఇంతలోనే ఈ విషాద ఘటన జరగడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దళిత మహిళపై దాడి అమానుషం

- నిందితుడు ఎన్‌వీ రెడ్డిని అరెస్టు చేయాలి
- మాదిగ సంఘాల నాయకుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న మాదిగ న్యాయవాదుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఉదయ్‌కుమార్

అనపర్తి: దుప్పలపూడి గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళ కొమ్ము బుజ్జిపై దాడికి పాల్పడిన టీడీపీ నేత ఎస్.వెంకటరెడ్డి, అతని అనుచరులను 24 గంటల్లో అరెస్టు చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని మాదిగ న్యాయవాదుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సంయుక్తంగా డిమాండ్ చేశారు. బుధవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుజ్జిని వారు పరామర్శించారు. నిందితులు ఎంత పలుకుబడి కలిగిన వారైనా భయపడాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని బాధితురాలికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాదిగ న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడు కొండేపూడి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 6న దుప్పలపూడి గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత ఎస్.వెంకటరెడ్డి (ఎన్‌వీ) దళిత మహిళ బుజ్జిపై అమానుషంగా దాడి చేయడంతో మాదిగ సంఘాల తరపున నిజ నిర్ధారణ కమిటీగా తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు. తమ పరిశీలనలో ఇది కచ్చితంగా కుల వివక్షతోనే జరిగిన దాడిగా గుర్తించామన్నారు. గతంలో జరిగిన ప్రమాదంలో పోలీసులు కేసు నమోదు చేయడం బుజ్జి మరిది వీరబాబు బెయిల్ పై రావడం వ్యవహారం కోర్టులో నడుస్తుండగా దళితులను, అమాయకులను భయభ్రాంతులకు గురి చేస్తూ వెంకటరెడ్డి తన అధికార మదంతో ఇంటి వద్ద ప్రైవేట్ పంచాయితీ నిర్వహించడమేంటని ఆయన ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా ఇటువంటి పనులను చేస్తున్న వెంకటరెడ్డిని మూడు రోజులు కావొస్తున్నా పోలీసులు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తపల్లి ప్రసాద్, ధూళి జయరాజు, ఆకుమర్తి చిన్నా, మానవ హక్కుల సంఘ సభ్యురాలు ఖండవిల్లి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకులు గాలంకి నాగేశ్వరరావు, పల్లేటి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరికి దిగొచ్చి... కొబ్బరి కాయలు వినియోగించి..

సాక్షి ఇంపాక్ట్

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి కల్యాణంలో కొబ్బరి కాయలను తిరిగి వినియోగించారు. కొబ్బరి ధరలు పెరగడంతో వాటిని పక్కనబెట్టి అభిషేకాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై 'సాక్షి' దినపత్రికలో 'వీరేశ్వరా.. క్షమించవా' అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో దేవస్థానం అధికారులు స్పందించి స్వామివారికి నిర్వహించే అభిషేకాల్లో కొబ్బరి కాయలను తిరిగి వినియోగించడం మొదలు పెట్టారు. రూ.వెయ్యి పెట్టి అభిషేకం చేయించుకుంటున్న భక్తుల పేరున వినియోగించాల్సిన రెండు కొబ్బరి కాయలను వాడకపోవడంపై వారు మండిపడుతున్నారు. దీనికి స్పందించిన ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ కొబ్బరికాయలతో అభిషేకం జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో గతంలో జరిగినట్లే కల్యాణ అభిషేకాలు జరుగుతున్నాయని తెలిపారు. కొబ్బరికాయలు అందుబాటులో లేకపోవడంతో కల్యాణ భక్తులకు అసౌకర్యం కలిగిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆలయ సూపరింటెండెంట్‌ను ఆరా తీయగా కొబ్బరి కాయల పాటదారుడు సకాలంలో కొబ్బరికాయలు సరఫరా చేయకపోవడం వల్ల అసౌకర్యం కలిగిందని, ఇది తన దృష్టికి రాగానే చర్యలు తీసుకున్నానని చెప్పారు. సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.



వీరేశ్వరస్వామి వారికి కొబ్బరి నీళ్లతో అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఏటీఎం మార్చేసి.. సొమ్ము డ్రా చేసి



నిందితుడు రాంబాబును చూపుతున్న పోలీసులు

యానాం: నగదు తీసుకునేందుకు ఏటీఎంకు వెళ్లిన ఓ విశ్రాంత పోలీసు అధికారినే మోసం చేసిన ఘటనలో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. యానాం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్–2 కట్టా సుబ్బరాజు కథనం ప్రకారం.. గత నెల 28న యానాం పిల్లారాయ వీధిలో ఎస్‌బీఐ ఏటీఎం నుంచి విశ్రాంత పోలీసు అధికారి సత్యనారాయణ రూ.10 వేలు డ్రా చేశారు. అయితే మినీ స్టేట్‌మెంట్ రాకపోవడంతో పక్కనే ఉన్న పిఠాపురం వద్ద నరసింగపురానికి చెందిన కాసేబు రాంబాబును మినిస్టేట్‌మెంట్ తీయమని అడిగి పిన్ నంబరు చెప్పారు. మినీ స్టేట్‌మెంట్ రావడం లేదని చెప్పి రాంబాబు తన వద్ద ఉన్న మరో కార్డును సత్యనారాయణకు ఇచ్చాడు. అనంతరం రాంబాబు బయటకు వెళ్లి ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.70 వేలు తస్కరించాడు. జరిగిన మోసంపై సత్యనారాయణ యానాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యానాం క్రైమ్ టీమ్ సభ్యులు జాంటీ, దుర్గారావు, మల్లాడి గణేష్‌లు నిందితుడు రాంబాబును అదుపులోకి తీసుకుని రూ.వెయ్యి నగదు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై దువ్వాడ, కాకినాడ ప్రాంతాల్లో పలు కేసులు ఉన్నాయి.

వివాహిత ఆత్మహత్య

కొత్తపేట: స్థానిక బాబానగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై జి.సురేంద్ర కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన మనల్లె పావని (24), నాగరవీంద్రకు ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. రావులపాలెం సర్వే పామాయిల్ కంపెనీలో రవీంద్ర ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. సుమారు నాలుగు నెలల నుంచి కొత్తపేట బాబానగర్‌లో అద్దింట్లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం రవీంద్ర ఇంటికి రాగా తన భార్య ఉతికిన దుస్తులు ఆరబెట్టలేదని మందలించాడు. తరువాత రవీంద్ర పడక గదిలో నిద్రించగా పావని పక్క గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. ఇది గమనించిన భర్త చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి తన భార్యను కిందకు దించి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి కొండేపూడి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి


కాకినాడ క్రైం: ఓ వృద్ధురాలిని రైలు ఢీకొనడంతో మృతి చెందింది. స్థానిక దుమ్ములపేటకు చెందిన మూగు సూకరత్నం (64) బుధవారం తెల్లవారు జామున అదే ప్రాంతంలో ఉన్న రైల్వే ట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రైలు ఢీకొంది. ఆమె భర్త భూలోకం ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి నామవరంలోని ఒక ఇంట్లో చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్ తెలిపారు. ఈ వివరాలు మీడియాకు ఆయన బుధవారం తెలిపారు. నామవరానికి చెందిన రేలంగి లోవరాజు ఈ నెల 2న ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలసి తలుపులమ్మ లోవకు వెళ్లారు. దానిని గమనించి నిందితులు రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన నలబా సత్యనారాయణ అనే సత్తిబాబు (32), బెదంపూడి రత్నరాజు అనే నాని (20), ఇనకోటి పవన్‌కుమార్ (20)లు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 22 కాసుల బంగారు నగలు, రూ. 1.75 లక్షలు దొంగించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన రాజానగరం సీఐ వీరయ్య గౌడ్ తమ సిబ్బందితో దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితులను అరెస్టు చేశారు. చోరీకి పాల్పడిన తరువాత నగదులో కొంత తమ విలాసాలకు వాడుకున్నారు. నిందితుల నుంచి 22 కాసుల బంగారు నగలతోపాటు రూ. 1.15 నగదును స్వాధీనపర్చుకున్నారు.

డ్రిల్లింగ్ సమయంలో గ్యాస్ కిక్

పరుగులు తీసిన సిబ్బంది



గ్యాస్ కిక్ ఏర్పడిన పాశర్లపూడి ఓఎన్జీసీ బావి

మామిడికుదురు: పాశర్లపూడి, పాశర్లపూడి లంక గ్రామాల సరిహద్దులో ఓఎన్జీసీ బావి వద్ద డ్రిల్లింగ్ నిర్వహిస్తుండగా, బుధవారం రాత్రి గ్యాస్ కిక్ ఇచ్చింది. 20 మీటర్ల ఎత్తులో భారీ శబ్దంతో గ్యాస్ ఎగజిమ్మడంతో డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పరుగులు తీశారు. ఏం జరుగుతుందో తెలియక స్థానికులు సైతం తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపటి తరువాత గ్యాస్ కిక్‌ను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 3 నెలల క్రితం ఈ–2003 నెంబరు రిగ్గుతో ఈ బావిలో డ్రిల్లింగ్ చేపట్టారు. 2910 మీటర్ల లక్ష్యం మేరకు డ్రిల్లింగ్ నిర్వహించాల్సి ఉంది. 2,880 మీటర్లకు డ్రిల్లింగ్ చేరుకున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గ్యాస్ కిక్‌ను అదుపు చేసిన అనంతరం స్థానికులు కిక్ వద్దకు చేరుకుని అధికారులపై మండిపడ్డారు. ఏం జరిగిందని నిలదీశారు. ఏం జరిగిందో తమకు కూడా తెలియదని సమాధానం చెప్పడంతో సిబ్బందిపై మండిపడ్డారు.